AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
23-7-2026 (Thursday)
MAIN EDITION

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



**అక్షరటుడే, హైదరాబాద్:** డీజీపీ కార్యాలయంలో ఓ కానిస్టేబుల్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. డీజీపీ కార్యాలయంలో స్వామి అనే కానిస్టేబుల్ పని చేస్తున్నారు. గురువారం ఉదయం 5:30 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అక్కడ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాల్పుల శబ్దం వినిపించడంతో పోలీసులు వెళ్లి చూడగా.. అప్పటికే చనిపోయాడు. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మోదీపై రాహుల్ గాంధీ ఆగ్రహం



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశ యువత ప్రయోజనాలే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అంటూ ప్రధాని మోదీ చేసిన ట్వీట్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. దేశ యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీసింది మీరేనని ఘాటుగా బదులిచ్చారు. విద్యా వ్యవస్థను నాశనం చేసేవారిని ప్రోత్సహించడంతో పాటు బాధ్యులను మీరే కాపాడారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని, దేశంలోని విద్యార్థులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

### తెలంగాణ రక్షణ సేన నాయకుల అరెస్ట్



అక్షరటుడే, హైదరాబాద్: ఢిల్లీలో విద్యార్థుల నిరసనకు మద్దతుగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) విద్యార్థి నాయకులు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. దీంతో వారిని హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఓయూ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### వర్షా భావ పరిస్థితులపై మంత్రి పొన్నం సమీక్ష



అక్షరటుడే, హైదరాబాద్: ఎల్‌నినో వల్ల తలెత్తిన వర్షాభావ పరిస్థితులపై మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. సిద్దిపేట, కరీంనగర్, హన్మకొండ కలెక్టర్లతో భేటీ అయి, తాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్ పామ్ సాగు చేసేలా అవగాహన కల్పించాన్నారు.

### విద్యార్థుల నిరసనకు కేటీఆర్ మద్దతు



అక్షరటుడే, హైదరాబాద్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతూ విద్యార్థులు చేపట్టిన నిరసనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు తెలిపారు. ఈ మేరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కేటీఆర్ స్వయంగా పాల్గొననున్నారు.



**నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుండడంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పేపర్ లీకులపై ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. మన యువత సంక్షేమం, భవిష్యత్తు కంటే ముఖ్యమైనది ఏదీ లేదని మోదీ పేర్కొన్నారు. పరీక్షా పత్రాల లీకేజీ (పేపర్ లీక్) కేసుల విచారణ కోసం 'ఫాస్ట్-ట్రాక్ కోర్టుల'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు.** - అక్షరటుడే, ఢిల్లీ

# "యువత భవిష్యత్తే ముఖ్యం

- పేపర్ లీకేజీలపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు
- ప్రధాని మోదీ ప్రకటన
- నిందితులకు శిక్ష పడేలా చర్యలు

పేపర్ లీకేజీలకు పాల్పడిన వారికి త్వరితగతిన కఠిన శిక్షలు పడేలా చూసేందుకు చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ తెలిపారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి.. ఆ దిశగా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు తాము చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత భవిష్యత్తుకు హాని కలిగించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### రాజీనామా చేయాల్సిందే

విపక్షాలు, 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆందోళనలు చేస్తున్న తరుణంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. ఆయన ప్రకటనపై సీజేపీ స్పందించింది. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని పేర్కొంది. అప్పటి వరకు ఆందోళనలు విరమించమని స్పష్టం చేశారు. మరోవైపు విపక్షాలు సైతం పార్లమెంట్‌లో ఇదే విషయమై ఆందోళన చేస్తున్నాయి. కేంద్రం చర్చకు అంగీకరించినా.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాతే నీట్‌పై చర్చించాలని పట్టుబడుతున్నాయి.

### జంతర్‌మంతర్ వద్ద బలగాల మోహరింపు

జంతర్‌మంతర్ వద్దకు గురువారం సీజేపీ కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. కేంద్ర మంత్రి రాజీనామా చేసేవరకు ఆందోళనలు ఆగవని పేర్కొన్నారు. కాగా ఢిల్లీలో ఉద్రిక్తతల నేపథ్యంలో అధికారులు పలు ప్రాంతా ల్లో ఇంటర్నెట్ సేవలను నిలిపి వేశారు. దీనిపై ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జంతర్‌మంతర్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్‌కు వెళ్లే రోడ్లు దిగ్బంధించారు. భారీగా సీఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్, ప్రత్యేక పోలీస్ బలగాలు మోహరించారు.

### చర్యలు తీసుకుంటాం

యువత భవితకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. పేపర్ లీక్ కేసుల విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేస్తామని ప్రధాని హామీ ఇచ్చారన్నారు. దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత భవితతో ఆడుకోవాలనుకుంటున్నవారికి ప్రధాని మోదీ చర్యలు ఇబ్బందికరంగా మారాయన్నారు.

## బలిసి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు: సీఎం



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ శాసనసభలో జరుగుతున్న ఆధునీకరణ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన ఆయన.. ఓట్ల సవరణ, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలపై ఘాటుగా స్పందించారు. తనకు రెండు చోట్ల ఓట్లు ఉన్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. తనకు ఎక్కడైనా రెండు ఓట్లు ఉన్నట్లు నిరూపించే ధైర్యం ఉంటే ఆధారాలతో సహా ఫిర్యాదు చేయవచ్చని సవాల్ విసిరారు. నిబంధనల ప్రకారమే తాను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఓటును బదిలీ చేసుకున్నట్లు స్పష్టం చేశారు. చరిత్ర తెలుసుకోకుండా, బలిసి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ప్రత్యర్థులపై తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు.

## పార్లమెంట్ ఆవరణలో ఉద్రిక్తత..



**అక్షరటుడే, ఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌లో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం పార్లమెంట్ కాంప్లెక్స్‌లోని 'మకర్ ద్వార్' వద్ద అధికార, ప్రతిపక్ష కూటముల ఎంపీలు ఎదురెదురుగా నిరసనలకు దిగడంతో గందరగోళ వాతావరణం నెలకొంది.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ 'ఇండియా' కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. అదే సమయంలో విపక్షాల తీరును నిరసిస్తూ ఎన్డీఏ ఎంపీలు కూడా అక్కడే నిరసనకు దిగారు. ఈ క్రమంలో సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ చేతిలోని ప్లకార్డును బీజేపీ ఎంపీ అరుణ్ సింగ్ బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట జరిగాయి.



## అక్రమాస్తుల కేసులో డీఈ వెంకటరమణకు రిమాండ్

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో రెడ్కో డీఈ ముత్యం వెంకటరమణకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను చంచల్‌గూడ జైలుకు తరలించారు. రెడ్కో డీఈగా పనిచేస్తున్న వెంకటరమణ నివాసాలలో ఏసీబీ అధికారులు బుధవారం దాడులు చేపట్టిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు బంధువుల ఇళ్లలో సోదాలు చేపట్టారు. తనిఖీల సమయంలో వెంకటరమణ భారీగా అక్రమాస్తులు సంపాదించినట్లు గుర్తించారు. తన భార్య పేరిట పలు కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, అనేక భవనాలు, ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు. మొత్తం ఆస్తుల విలువ రూ.300 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి నిందితుడిని అరెస్ట్ చేశారు.

## ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లు కూల్చివేత

**అక్షరటుడే, ఢిల్లీ:** జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఒక పోలీసును ఉగ్రవాది క్యాలివేసిన విషయం తెలిసిందే. ఘటన తర్వాత.. ఉగ్రవాదులు ఆదిల్ తోకర్, హరూన్ రషీద్ గనాయిలకు చెందిన రెండు ఇళ్లను అధికారులు కూల్చివేశారు. లష్కర్‌ఎతైబాకు చెందిన ఇద్దరు ఉగ్రవాదుల ఇళ్లను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. అమర్‌నాథ్ యాత్ర భద్రతా విధుల్లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ ఆశిక్ హుస్సేన్‌ను బుధవారం మధ్యాహ్నం అనంతనాగ్‌లోని లాల్ చౌక్ వద్ద ఒక ఉగ్రవాది కాల్చి చంపిన కొద్ది సేపటికే ఈ చర్య చేపట్టారు. కాగా.. కానిస్టేబుల్‌ను చంపిన ఉగ్రవాదుల కోసం పోలీసులు, బలగాలు గాలిస్తున్నాయి.



## ఫీజు బకాయిలపై బీజేపీ పోరుబాట



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు అందక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై బీజేపీ ఆందోళనలు నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. బీజేవైఎం ఆధ్వర్యంలో ఫీజు బకాయి.. బీజేపీ లడాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్లను గురువారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆవిష్కరించారు. బీజేపీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. తెలంగాణలో నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. కానీ నేటి వరకు ఉద్యోగాలు లేవని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన హక్కు కోసం భారతీయ జనతా యువమోర్చా ఈ అంశాన్ని ఉద్యమంగా చేపట్టిందని తెలిపారు.

## సోనం రఘువంశీ బెయిల్ రద్దు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మేఘాలయ హనీమూన్ మర్డర్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. తన భర్త రాజా రఘువంశీ హత్య కేసులో ప్రధాన నిందితురాలైన సోనం రఘువంశీకి మంజూరైన బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. ఈ కేసులో నిందితురాలు బెయిల్‌పై బయట ఉండడంతో విచారణకు ఆటంకం కలగవచ్చని జస్టిస్ ఎం.ఎం.సుందరేష్, జస్టిస్ పి.బి.వరాళేలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఆరు నెలల్లోపు విచారణ పూర్తి కాకపోతే, సోనం విచారణ కోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది.

## త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు!



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంతో మంది పేదలు ఎదురు చూస్తున్నారు. జూన్ 2న లబ్ధిదారుల జాబితా ప్రకటిస్తామని గతంలో మంత్రులు ప్రకటించారు. అయితే ఇంతవరకు దాని గురించి మాట్లాడడం లేదు. అయితే పది రోజుల్లో రెండో విడత ఇళ్లను మంజూరు చేస్తారని సమాచారం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలివిడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేశారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం మొదలు పెట్టారు. పలువురి నిర్మాణాలు పూర్తి కావడంతో గృహ ప్రవేశాలు కూడా చేశారు. ఇల్లు కట్టుకున్న వారికి ప్రభుత్వం వేగంగా నిధులను విడుదల చేస్తోంది. విడతల వారీగా రూ.5 లక్ష సాయం అందజేస్తోంది. దీంతో రెండో విడత కోసం ఎంతోమంది పేదలు నిరీక్షిస్తున్నారు.

## రాముడిని, మోదీని తిట్టడమే నిరసనా..: పాక్ మాజీ క్రికెటర్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఢిల్లీలో జరుగుతున్న నిరసనలపై పాక్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాముడిని, మోదీని తిట్టడమే నిరసనా అని ప్రశ్నించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. అది వైరల్ అవుతోంది. భారత్ ప్రతి నిరసన ఒకే స్క్రిప్ట్‌తో సాగుతున్నట్లు అనిపించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. రాముడు, భారతమాత, హిందుత్వం, ప్రధాని మోదీ, ఆయన కుటుంబం లక్ష్యంగా దూషణలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలపై చర్చలు, పరిష్కారాల కన్నా నినాదాలు, గందరగోళానికే ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం జరగకముందే కొందరు రైతులు ఢిల్లీని దిగ్బంధించడానికి వెళ్లారని, ఇది ఓ సర్కస్‌లా మారుతోందన్నారు. ఇంతమంది ప్రజలు ముందుగా నిరసన తెలిపి.. ఆ తర్వాతే వాస్తవాలను సరిచూసుకోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఒక దేశం ఎలా పురోగమించగలదని ప్రశ్నించారు.